
# భేతాళుడు మరచిన మరోకధ

— 'రాధ'



"డాక్టర్ అంటే మంత్రగాడు కాదు, దేముడు అంతకంటే కాదు అద్భుతాలుచేసి చూపించటానికి ... పోయే ప్రాణాన్ని వెనక్కి లాగటానికి ప్రయత్నిస్తాడేకాని మెడకి త్రాడువేసి మేకపిల్లని కట్టిపడేసినట్లు ప్రాణాన్ని కట్టిపడేయలేదు సుమా... ఆ సమయం వస్తే ఎన్ని సంకెళ్ళయినా త్రెంచుకు పోతుంది ఆరే ప్రాణం ... ఎవరు ఆపగలరు చెప్పండి దాన్ని."

పది మనుషుల బరువు మోస్తున్న ఒక ఆంగ్లేయ భారీవిగ్రహం ఆ వేద వాక్కులు శలవిచ్చి విరగబడి నవ్వింది.

"బాగా చెప్పారు ... వాస్తవానికి ఈ డాక్టర్లు ఏమీచేయలేరనే చెప్పాలి. గుండె లోతులు కనిపెట్టటానికి ఎన్నెన్నో యంత్రాలు కనిపెట్టారు. గుండెల్లోకి గొట్టాలు పంపి ఏ కవాటం ఎలా తెరుచుకుంటుందో చూస్తున్నారు. క్రమం తప్పితే కంప్యూటరుపెట్టి గుండెనే కొట్టిస్తున్నారు వాళ్ళకి నచ్చిన విధంగా. మనిషిని బ్రతికిస్తానికే అనుకోండి యిదంతా. కాని ఏం లాభం? మనిషి శాశ్వతంగా అలా వుండిపోగలుగుతున్నాడా పుట్టాక. బాల్యం, యవ్వనం, ముసలితనం క్రమం తప్పకుండా వాటంతట అవి రావటం మానేశాయా చెప్పండి? మనిషి ఎప్పటిలా ఈ తనువు చాలిస్తూనేవున్నాడు అందులో ఏమీ మార్పులేదు ... మార్పురాదు" తోటి దొర వంతపాడాడు చదువుతున్న పేపరు మూసి.

"మీరు గుర్తించారో లేదోకాని మానవుడి సుఖం కోసం నానాకష్టాలుపడి వేలకువేలు నోరులేని జీవాల్ని ప్రయోగాల పేరిట బలిచేసి ఏదో సాధించామని అబ్బుర పడుతున్నారేకాని. ఈ డాక్టర్లు మాత్రం

వాళ్ళకోసం ఏం మిగుల్చుకుంటున్నారు చెప్పండి.''

నల్టేటిలో వున్నా చలాకీగా ఈది తేలగల నవ్వుల్లు పొంగిపొరలుతున్నాయి నడివయసులో వున్న ఆ దొరసాని అందాలు ఆమె మాటలతోపాటు.

''సర్లేండి కసాయివాడిచేయి కత్తికి...వైద్యుడి విజ్ఞానం మనకి అంకితం అయ్యాక వాళ్ళకి విశ్రాంతి ఎక్కడ వుంటుంది. మన ఆశలికి అంతు ఎక్కడ వుంటుంది'' యవ్వనం దాటి పరుగులు తీస్తున్న యింకో ఆంగ్లేయుడు ఆక్షేపించాడు.

''అది నిజమేనా'' నా వూహాల్లో ఆ ప్రశ్న మారుమ్రోగటంలో ఏమీ ఆశ్చర్యం లేదేమో ఆ సమయంలో.

ముందు సీట్లో కూర్చుని ఆ నలుగురి ఆంగ్లేయుల సంభాషణ వింటున్నాను ఆసక్తిగా. లండన్ నుంచి లివర్‌పూల్ పరుగెడ్తోంది మేము ఎక్కిన ఆ రైలు నూరుమైళ్ళ వేగంతో నా ఆలోచనలతో పోటీపడ్తూ!

ఆ భారీ విగ్రహం అన్న మాటల్లో నిజం లేకపోలేదు. ఆ నిజం ఏమిటో చెప్పాలంటే మీకు ఓ కథ చెప్పాలి మరి.

నేను యింగ్లాండ్ వచ్చిన రెండు సంవత్సరాలకే న్యూ కేజల్ జనరల్ హాస్పిటల్‌లో మెడికల్ రిజిస్ట్రార్ అవ్వగలిగాను. అదృష్టవశాత్తూ అనుకోకుండా మెంబర్‌షిప్ పరీక్షలు పాసవ్వటమే అసలు కారణం అయివుండొచ్చు నా విషయంలో.

ఆంగ్లేయులు ఎన్నో విషయాల్లో ఎంతో ముందుకు వచ్చారుకాని స్వార్థంలో, తమ పరభేదాలు చూపించటంలో యింకా భారతదేశాన్ని పాలిస్తున్న రోజుల్లోనే వుండిపోయారు అనిపిస్తుంది ఒకోసారి. ఏదైనా పెద్ద పదవినికాని, ప్రతిభనికాని ఒక భారతీయుడి చేతిలో పెట్టేముందు పదిసార్లు ఆలోచిస్తాడు ఆంగ్లేయుడు. దానికి కారణాలు అనేకం వున్నా జాతి మత వివక్షణతో భారతీయుణ్ణి వేరుపరచటం, వెలివేయటం ఒకటి అని అందరూ అంటుంటే విన్నాను. కాని నాకు సంబంధించినంత వరకూ అది ఒక అద్భుతమనే చెప్పాలి. పిచ్చికాని అరిచే కుక్క కరుస్తుందా, కరిచే కుక్క అరుస్తుందా క్రమం తప్పకుండా?

అసలు కధకి వద్దాం.

ఆ రోజు నేను డ్యూటీ చేస్తున్నాను. రాత్రి తొమ్మిది గంటలు దాటింది. డాక్టర్ల కామన్ రూమ్‌లో కూర్చుని టి. వి. లో వస్తున్న అమెరికన్ సీరీస్ చూస్తున్నాను.

నా బ్లీప్ మ్రోగింది.

''రింగ్ కేజుయాల్టీ ప్లీజ్'' అందాల కేరల్ గొంతుక నాజూకుగా వినిపించింది ఫోన్‌లో.

''డాక్టర్ రాజేష్ స్పీకింగ్'' అంటూ మళ్ళీ ఫోన్ ఎత్తి రింగ్ చేశాను.

''యి. సి. జి. చూసి ఒపీనియన్ చెప్తారా... పేషెంట్ గుండె నొప్పితో వచ్చింది.'' అన్నాడు కేజుయాలిటీ హౌస్ ఆఫీసర్.

పరుగెత్తాను అటువైపు.

ఆ ట్రేసింగు చూసి ఎంత ఆశ్చర్యపడ్డానో అంతకంటే ఎక్కువగా దిగ్భ్రమచెందాను ఆ నవ యవ్వన యువతిని చూసి. ఆమె పేషెంట్ అంటే నమ్మశక్యం కాలేదు పలకరించేవరకూ.

''యిప్పుడు ఎలా వుంది మీకు'' అని అడిగాను ఆంగ్లంలో నన్ను నేను పరిచయం చేసుకుంటూ

''అయి థింక్ అయామ్ ఆల్‌రైట్... బట్ లిటిల్ పెయిన్ దేర్'' అంది వీణ మీటినట్లు తియ్యని కంఠానికి శృతి పెడుతూ.

''మిస్ పామర్'' కేస్‌షీటు చూసి పేరు తెలుసుకున్నాను.

''తెరీసా అని పిలవండి ఫర్వాలేదు'' అంత బాధలో కూడా అంత అందమైన ముసిముసి నవ్వులు పూల జల్లులా ఎలా వెదజల్ల గలిగిందా ఆ ఆంగ్లేయ యువతి! అనిపించింది.

''ష్యూర్... థ్యాంక్స్యూ... చూడండి తెరీసా మీరు కాస్సేపు ఓపికపడితే అంతా సర్దుకుంటుంది నొప్పి తగ్గటానికి చిన్న యింజెక్షన్ యిస్తాను.. ప్లీజ్ వెయిట్'' అన్నాను నెమ్మదిగా.

''యింజెక్షన్ యిచ్చి తీరాలా... నాకు నీడిల్స్ అంటే చాలా భయం.''

''డోంట్ వర్రీ...నొప్పిలేకుండా యిస్తాను...''

''ఆల్‌రైట్...''

''మీ వయసు యిరవై ఆరు సంవత్సరాలా, నిజమేనా.''

నా కళ్ళల్లో ఆశ్చర్యం కొట్టవచ్చినట్లు కనిపించి వుంటుంది. తెరీసా ఫక్కున నవ్వింది.

''ఏ అలా కనిపించటంలేదా.''

''యవ్వనం వయసు తెలుసుకోటం చాలా కష్టమే మరి'' మాటల్ని అడ్డు పెట్టుకున్నాను, కంగారు కప్పిపుచ్చుకోటానికి.

''ఏమీ కంగారు పడకండి. అది నా అసలైన యవ్వనం వయసే.''

ఎందుకో నా వైపు గ్రుచ్చిగ్రుచ్చి చూసింది నాక్కి పలుకుతూ.

చూపులు త్రిప్పుకోటం నావంతు అయ్యింది.

''చూడండి మిస్ పామర్... యిదొకరకమైన గుండెపోటు... యింత చిన్న వయసులో మీకు అది రావటం చాలా చిత్రంగా వుంది...మీరు హాస్పిటల్‌లో కొన్నాళ్ళు వుంటే అన్ని పరీక్షలుచేసి కారణం తెలుసుకోటానికి ప్రయత్నిద్దాం...'' అన్నాను.

''బ్రతుకుతానుకదా కొన్ని రోజులు'' మాటల్లో అలజడిని కళ్ళల్లో కురిసే నవ్వులతో కొట్టిపారేయటానికి ప్రయత్నించింది.

''నోనో...మీ ప్రాణానికి ఎటువంటి ప్రమాదం లేదు... నేను హామీ యిస్తున్నాను సరేనా.'' సున్నితంగా సుడిగుండాల్ని తప్పించటానికి ప్రయత్నించాను.

''మీమీద నాకు నమ్మకం వుంది'' ఎర్రని పెదిమలమీద చిరునవ్వు విరబూసిన మందారాల్ని మరిపించింది.

'యింత అందమైన ఈ అబలకి ఈ జబ్బేమిటి పరమాత్మా' అంది పిరికి గుండె.

''ఆల్‌రైట్... అయితే మిమ్మల్ని వెంటనే యింటెన్సివ్ కరొనరీకేర్ యూనిట్‌కి పంపించే ఏర్పాటు చేస్తాను...మీన్‌వైల్. యు ప్లీజ్ రిలాక్స్ అండ్ టేక్ యిట్ ఈజీ... విత్ యు'' సముదాయించాను

''ష్యూర్ ష్యూర్. . ఏజ్ యు విష్ డాక్టర్'' అంటూ అనుకోకుండా నా చేయి అందుకుని ఆప్యాయంగా నొక్కి వదిలింది.

ఆంగ్లేయులు కృతజ్ఞతని కొంచమైనా దాచుకోలేరు అనుకుంటూ

మర్నాడు వార్డ్ రౌండ్స్‌కి వెళ్ళేముందు తెరీసాపామర్‌ని పలకరించటానికి యింటెన్సివ్ కేర్ యూనిట్‌కి వెళ్ళాను.

''ఎలా వుంది యిప్పుడు.''

''ఓ.. అయామ్ ఓ కె. నో ప్రాబ్లమ్ '' అంది చిరునవ్వుతో.

ఆధునిక వసతులతో అత్యద్భుతంగా ఏర్పాటు చేయబడ్డ అంపశయ్యమీద హాయిగా సేద తీర్చుకుంటున్న అపరదేవకన్యలా కనిపించింది తెరీసా ఆ నిముషంలో. నవయవ్వనంతో నిండి పొంగిపొరలుతున్న ఆమె లేతగుండెని ఒక యంత్రానికి అతికించి పదిమంది నర్సులు ప్రతీ క్షణం పర్యవేక్షణ సాగిస్తున్నారు ప్రక్క గదిలోంచి. గుండె కొట్టుకోటం క్రమం తప్పితే క్షణాల్లో దాన్ని సక్రమపరచటానికి ఆమె నరనరాల్లో ప్లాస్టిక్ సూదులు దిగించి అన్నింటికీ సిద్ధంగా వుంచాం.

ఆగే గుండెని ఆగకుండాచేసి నవయవ్వని ప్రాణాన్ని ప్రమాదంనుంచి తప్పించాలనే ఆ తపనంతా

''నొప్పి ఏమీ లేదుకదా.''

''నో... థేంక్స్ ఫర్ వాట్ యు హేవ్ డన్'' నాడి పరీక్షిస్తున్న నా చేయి తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కింది.

ఆమె కళ్ళు చిత్రంగా మెరుస్తున్నాయి.

''దట్స్ మై డ్యూటీ మిస్ పామర్...'' చిరునవ్వుతో సమయస్ఫూర్తిని ప్రదర్శించి చేయి వెనక్కు తీసుకున్నాను.

''యు ఆర్ ఎ నైస్ మేన్''

''థేంక్యూ.. ''

సంఘటల్ని చిత్రాలుగా మార్చటంలో ఆంగ్లేయులు ఎంత ఆరితేరినవారో నాకు బాగా తెలుసు. అందుకే చేతికి అందనంత దూరంలో వుండటం నేర్చుకున్నాను అన్ని విషయాల్లో.

''నేను కొన్ని ప్రశ్నలడుగుతాను చెప్తారా?'' అన్నాను మాట మారుస్తూ.

''ఓ... ష్యూర్... మీలాంటి మగవాడు ఏది అడిగితే కాదనగలదు... ఏ ఆడదైనా...''

అందాలు త్రెంపి విరజల్లినట్లు నవ్వింది తెరీసా.

''ఆ సంగతి యింతవరకూ నాకు తెలీదే.''

''తెలిస్తే ఏంచేసి వుండేవారు...''

''దానికి సమాధానం నాకంటే మీకే బాగా తెలుసనుకుంటాను.''

''నేనే మీరైతే ఏం చేసివుండేదాన్నో తెలుసా?''

''ఏం చేసి వుండేవారట ?''

నాకు తెలుసు ఆ సంభాషణని అనవసరంగా పొడిగిస్తున్నానని. కాని అదొక రకమైన ఆకర్షణ. మగవాడికి, ఆడదానికీ మధ్య ఎప్పుడూ ఆరని చిచ్చులా రగులుకొనే కోరిక నన్ను మాటల్లోకి దింపింది ఆ క్షణం.

''కమాన్ ... ఆ మాత్రం వూహించలేరా'' తను ఒక పేషెంట్ అన్న సంగతి మర్చిపోయి వుల్లాసంగా మాట్లాడింది తెరీసా.

"అసలు విషయం మర్చిపోతున్నారు."

"ఏమిటది ?"

"కథ మీరు చెప్తున్నారు .. నేను వింటున్నాను."

క్షణకాలం నివ్వెరపోయింది తెరీసా నా మాటలకి.

"మీ యిండియన్ మగవాళ్ళు యింత తెలివిగా మాట్లాడగలరని నాకు యింతవరకూ తెలీదు సుమా" అంది మునిపంటితో పెదవి కొరుకుతూ.

కథ చేయిజారి కాలంలోకి ప్రవహిస్తోంది అని పసిగట్టాను. నా జాగ్రత్తలో నేను వుండటం మంచిది అనిపించింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు" నెమ్మదిగా అడిగింది తెరీసా.

"అదే నేను అసలు మిమ్మల్ని అడగాలనుకున్నది ఏమిటా అని . ."

"సేవ్ యిట్ డాక్టర్...ముందు నన్నో ప్రశ్న అడగనివ్వండి"

ఏమిటన్నట్లు చూశాను.

"మీకు పెళ్ళి అయ్యిందా ?"

"మీరు ఆ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారో తెలుసుకోవచ్చా ?"

"మీరు కంటికి ముచ్చటగా కనిపిస్తుంటేను."

అదే తేడా హిందూ స్త్రీకి, ఆంగ్లేయ యువతికీ సిగ్గు మనకి తెర అయితే తెగింపు వాళ్ళకి తెరచాప. జీవితంలో ఎలాంటి చోటకైనా తేలికగా చేరుకోగలుగుతున్నారు అందుకేవాళ్ళు.

"ఎవరి కంటికి .."

"ఫలానా కంటికి అని చెప్తే ఏం చేస్తారు?"

"ఏముంది చేయటానికి."

"వోంట్ యు ఈవెన్ కిస్ హెర్."

నాకు అర్థమయ్యింది, పరిస్థితి చేతిలోంచేకాదు చరిత్రలోకి కూడా ప్రాకుతోందని.

"నో . అయ్ వోంట్."

"అది చాలా తప్పు సుమా."

"తప్పించుకోటానికి మీ ఆంగ్లేయులు ఉపదేశించిన మంత్రం వుంది కదా"

"వ్వాట్"

"అదే, థేంక్స్ చెప్తే సరిపోతుందనుకుంటాను..."

"మై గుడ్‌నెస్... యు మెన్ ఆర్ రియల్లీ సమ్‌తింగ్."

"నన్ను కూడా కలుపుతున్నారా వాళ్ళలో" మొదటిసారిగా గట్టిగా నవ్వాను.

క్షణకాలం మౌనం నాట్యం చేసింది. వుత్సాహంగా సాగుతున్న టి. వి సీరియల్ మధ్య చిన్న కమర్షియల్ ప్రకటనలా,

"ఇంతకీ మీరు నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు" అంది తెరీసా.

"ఏ ప్రశ్నకి."

"మీ పెళ్ళి గురించి" వెటకారం ధ్వనించింది ఆమె గొంతుకలో.

"ఏముంది చెప్పటానికి."

"ఏమీ లేదా..."

"లేదనే చెప్పాలి. ."

"అంటే మీకు యింకా పెళ్ళికాలేదన్నమాట... యిప్పుడు నాకు చాలా హాయిగా వుంది సుమా..."

"పెళ్ళి అయ్యిందంటేనో..." కావాలనే అడిగాను.

"మీరు కనికరంలేని డాక్టరనీ... పేషెంట్ అని కూడా కాస్త జాలిపడరనీ, కసాయివాడిలా ప్రవర్తిస్తారనీ అందరికీ చెప్తాను ."

ఆమె కళ్ళల్లో ఏదో తెలియని వింత అనుభూతి చిరునవ్వుల మధ్య దోబూచులాడింది.

"మీరు చెప్పినంత మాత్రాన వాళ్ళు నమ్ముతారని ఎందుకు అనుకోవాలి..."

"నేను ఈ డాక్టర్ చేతిలో చచ్చిపోయినా కూడా నమ్మరంటారా."

"ప్లీజ్... మనం ఈ సంభాషణ యింతటితో ఆపేస్తే మంచిదనుకుంటాను."

కంగారుపడటం నావంతు అయ్యింది.

"ప్రస్తుతానికి మీరు చెప్పినట్లు చేయటం తప్పించి నేను చేయగలిగింది ఏమీ లేదు అనుకుంటాను..."

నేను చురుకుగా చూశాను— 'ఏమిటి మీ వుద్దేశం' అన్నట్లు.

"అదే మీరు డాక్టరు . నేను పేషెంటు . మీరు చెప్పినట్లు వినవద్దా మరి" చిలిపిగా అంది ఆ మాటలు.

"ఆల్‌రైట్ మిస్ పామర్ ... అయ్ విల్ సి యు లేటర్" అన్నాను అక్కడనుంచి కదిలే ప్రయత్నం చేస్తూ.

"వెయిట్ ... వోంట్ యు కిస్ మి బెఫోర్ యు గో" అంది గోముగా చూస్తూ.

"మీరు పేషెంటు, నేను డాక్టరు అని ఇప్పుడే గుర్తుచేశారు. మర్చిపోయారా అప్పుడే" మాటలతో త్రోసిపుచ్చాను.

"పెషెంటు అయినా—డాక్టర్ అయినా ముద్దు మంచితనాన్నే గుర్తుచేస్తుంది. మనసుకి నచ్చిన వాళ్లని ముద్దుపెట్టుకోటంలో ఏమీ తప్పులేదు. ఎవరూ తప్పు పట్టలేరు."

"అయ్‌సీ."

"అయితే ఆలోచనదేనికి ?"

"మనం కాస్త మితిమీరి ప్రవర్తిస్తున్నాం అనుకుంటాను."

"చూడండి డాక్టర్ రాజేష్...పసిపాప చేతులు చాపి ఎత్తుకోమని ఎగిరి గెంతేస్తుంటే చూసీ చూడనట్లు ప్రక్కకు తప్పుకునే మనిషిని ఏమంటారో మీకు తెలుసా ?"

"ఏమంటారట ..."

"మొండివాళ్ళకి చెప్పినా ప్రయోజనంలేదు. చెవిటివాడి చెవిలో శంఖం వూదినట్లే అవుతుంది."

"మీ బాధేమిటో నాకు అర్థం అయ్యిందికాని, దానికీ దీనికీ తేడా లేదంటారా చెప్పండి."

"మీ దేశంలో ఆ తేడాలు వుంటే వుండొచ్చునేమోకాని .. మాకు అలాంటి భేదాలు, భావాలు లేవు. ఈపాటికి మీరు గుర్తించే వుండాలే ఆ విషయం."

"బోసినవ్వులు నవ్వే చిన్నారి పాపని ముద్దుపెట్టుకోటంలో అర్థం వుందికాని...మాటలు నేర్చిన చిలకని ముద్దాడటంలో నాకేమి ప్రత్యేకత కనిపించటంలేదు, కేవలం ఆకర్షణ తప్పించి."

"అదే పొరపాటు ముద్దుకి చాలా అర్థం వుంది. మనసులో వుప్పొంగే మంచితనాన్ని, గుండెల్లో పొంగి ప్రవహించే ప్రేమనీ, మాటల్లో చూపించలేని అభిమానాన్ని ముద్దులో ఎంతో తియ్యగా అందివ్వవచ్చు మాటలు నేర్చిన చిలకయినా—ఆటలు నేర్చిన గోరింకకయినా — అది కేవలం మాటలు రాని పసిపాపలకే పరిమితంకాదు మహాశయా ! ఏమైనా ముద్దు విలువ తెలుసుకోవాలంటే మనిషిలో కాస్త చైతన్యం, మనసుకి కాస్తంత స్పర్శజ్ఞానం వుండాలనుకుంటాను" ఆ ప్రసంగంలో వున్న ఎత్తిపొడుపు గుర్తించకపోలేదు నేను

"అలాగా... వింటానికి చాలా ఆసక్తిగా వుంది ఏమైనా మన యిద్దరిమధ్యా మాటల్లో చెప్పుకోలేనంత ఏమీలేదుకదా ముద్దుతో మభ్యపెట్టుకోటానికి. . నిజానికి మన యిద్దరిమధ్య వున్న పనంతా మాటలతోనే అనుకుంటాను. డాక్టర్‌గా అడగటం నా పని .. పేషెంట్‌గా చెప్పటం మీ వంతు. ఏమంటారు..." అన్నాను తేలికగా.

"ఏమో నాకు మాత్రం చెప్పలేనిది ఏదో చాలా వుంది అనిపిస్తోంది."

ఆమె చూపులు నన్ను కలవరపెట్టాయి

"సేవ్ యిట్ మిస్ పామర్ . కలుసుకున్న ప్రతీ ఆడా మగా రోమియో జూలియట్‌లూ కాలేరు... అన్ని సంఘటనలూ ప్రేమ కథలూ కాలేవు..."

"మీ అభిప్రాయంతో ఏకీభవించాలని ఏమీ రూల్ లేదుగా."

"అయితే ఏమంటారు యిప్పుడు ?"

"ఆడదాని అభిమానాన్ని కాలదన్నటం మగతనం అనిపించుకోదనుకుంటాను."

ఆమె మనసంతా ఆ మాటల్లో వుందా అనిపించింది. ఆ చూపుల్లోంచి చూపు తప్పించుకోటం నాకు కాని పనే అయ్యింది.

"ఆల్‌రైట్... మీరు పేషెంట్... నేను డాక్టర్‌ని... మిమ్మల్ని కోలుకునేటట్లు చేయటం నా కర్తవ్యం... దానికి మందు ముద్దే అయితే... వై షుడ్ అయ్ సే. . నో" అంటూ ఆమె చేయి అందుకుని సున్నితంగా ముద్దుపెట్టాను వణికే పెదవులతో.

"నో... నాట్ లైక్ దట్... ఎదిగిన మనుషులు ముద్దుపెట్టుకునే తీరే వేరు" అంటూ హఠాత్తుగా నా మెడచుట్టూ చేయివేసి మీదకు లాక్కుని ఎర్రని పెదిమలతో నా పెదవులు మూయించింది, వుక్కిరి బిక్కిరి చేసే ఆ గాఢ చుంబనతో.

ఆ క్షణం ఆ దృశ్యం ఎవరి కంటపైనా పడివుంటే ?

ఆ వాతావరణంలో నా పిరికి మనసులో ఆ కలవరపాటు బెదిరిన లేడిపిల్లలా పరుగు తీయటంలో ఆశ్చర్యం లేదేమో !!

* * *

మా బాస్ డాక్టర్ హెండర్‌సన్ వయసులో యాభై ఐదు ఏళ్ళు పైబడ్డా యింకా యవ్వనం అంచులమీద ఒంటికాలుతో నేర్పుగా నడుస్తున్నట్లే కనబడుతుంటాడు. అతను వయసులో వున్నప్పుడు అనేక సుందరాంగులు అతని చుట్టు ప్రదక్షిణ

చేస్తుండేవారనీ, అప్పుడప్పుడూ చంద్రగ్రహణాలతో పాటు సూర్యగ్రహణాలు కూడా అతని జీవితంలోకి తొంగి చూశాయనీ, కథ కంచికి చేరేముందు ఒక నెరజాణ అతడ్ని చేజిక్కించుకుని సేరుకి సతీమణి అయి పెర్మనెంట్‌గా అతడి ముక్కుకి త్రాడు వేసిందనీ ఒక పుకారు.

నిజం దేముడికే తెలియాలి !

గతంలోని అనుభవాల సారం యిప్పటికీ డాక్టర్ హెండర్‌సన్‌లో కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వుంటుంది, ఆడవాళ్ళతో అతను ప్రవర్తించే తీరులో.

కొత్తగా నర్స్ స్టూడెంట్ మా వార్డ్‌కి వస్తే బుగ్గమీద చిటికవేసి, భుజాలచుట్టూ చేతులు వేసి ఆప్యాయంగా ఆహ్వానిస్తాడు, పారాలు చెప్పినా చెప్పకపోయినా, అన్న ఘనత డాక్టర్ హెండర్‌సన్ దక్కించుకున్నాడని వేరే చెప్పక్కర్లేదు.

అతనిలో ఏమి ఆకర్షణ వుందోకాని ముద్దుపెట్ట కుండా అతనికి వీడ్కోలు చెప్పిన యువతిని నేను యింతవరకూ చూడలేదనే చెప్పాలి మరి.

ఒకసారి ఎప్పుడో మా వార్డ్ సిస్టర్ అంటుంటే విన్నాను– "హెండర్‌సన్‌కి జేమ్స్‌బాండులా ఒక ప్రత్యేకమైన సెక్స్ అప్పీల్ వుంది– దాన్ని తప్పించు కోటం ఎవరి తరం ?"

వార్డ్ రౌండ్స్‌కి వచ్చాడు డాక్టర్ హెండర్‌సన్

"హల్లో . యు ఆర్ మిస్ పామర్ . నేను సరిగ్గా గుర్తుపట్టాననుకుంటాను."

ఎప్పటిలా తన చిరునవ్వులు చిందిస్తూ ఎలకరించాడు డాక్టర్ హెండర్‌సన్.

"ఓ హల్లో" వీణ మీటినట్లు ప్రత్యుత్తరం యిచ్చింది తెరీసా పామర్.

తనని తాను పరిచయం చేసుకుని "ఎలా వుంది వంట్లో" అని అడిగాడు

"అయామ్ ఒకె. ఐ సపోజ్ . ధ్యాంక్యూ"

"నా ఎంగ్ అసిస్టెంట్ డాక్టర్ రాజేష్" అని నావైపు ఒక చిత్రమైన చూపు విరిచి విసిరి–

"చెప్తుంటే విన్నాను, నువ్వు చాలా ఎక్కువ సిగరెట్లు కాలుస్తావట నిజమేనా ?" అన్నాడు హెండర్‌సన్

"నిజమేనని కాస్త భయపడూ చెప్పాలను కుంటాను" కాస్త వెక్కిరింపు ధ్వనించింది దొరసాని ధోరణిలో.

"అబద్ధం చెప్పలేనప్పుడు నిజాన్ని వెళ్ళగక్కటమే మంచిది. భయపడి దాచుకుంటే అదికూడా ఒకోసారి గొంతుక్కి అడ్డం పడవచ్చు. వూపిరాడకపోతే ఎంత ప్రమాదమో నీకు తెలుసుగా" తన హాస్యధోరణిలో మాటలు ప్రారంభించాడు హెండర్‌సన్.

"అఫ్‌కోర్స్ . వుపయోగపడితే అబద్దానికి కూడా చాలా విలువ వుంటుంది మరి ెక్కడ దాచినా."

తెరీసా అంత తెలివిగా తెగింపుతో సమాధానం చెప్తుందని అనుకోలేదు నేను పెద్ద డాక్టర్ వస్తే గడగడా వణికిపోతూ వున్న జబ్బు మరిచిపోవటం మన దేశ సాంప్రదాయం. ఎంత పెద్దమనిషి వచ్చి ఎదురుగా నిలబడినా వాక్ స్వాతంత్ర్యాన్ని వదులుకో కుండా ఎదిరించి నిలబడగలగటం వీళ్ళ ఆచారం చిత్రంగా వుంటుంది. ఆ రెండింటిమధ్య నిలబడి ఏంచేయాలో తోచక తికమకపడే నాలాంటివాడికి

"అఫ్‌కోర్స్ . నువ్వు అన్న మాటల్లో కూడా నిజం లేకపోలేదు. ఇంతకీ ఎన్ని సిగరెట్లు కాలుస్తూంటావు మై డియర్. ." అంటూ నాడి చూస్తున్నట్లు చేయి పట్టుకుని చివరికి తన అరచేతిలో ఆమె అరచేతిని ఆప్యాయంగా నొక్కాడు

"రోజుకా . నెలకా" ఫక్కున నవ్వింది తెరీసా హెండర్‌సన్ చేతిని అలాగే పట్టుకుని.

"నీదంత కంప్యూటర్ బ్రెయిన్ అయితే సంవత్సరానికి ఎన్ని కాలుస్తావో చెప్పు పోని..." ఆమె చేతిని రెండు చేతుల్లోకి తీసుకుని బెడ్‌మీద ఆమె ప్రక్క చోటు చేసుకుని కూర్చుని మరింత ఆప్యాయంగా నొక్కాడు.

"ష్యూర్ వైనాట్..." అంటూ ప్రక్క చూపులు మా వైపు విసిరింది, మేము గమనిస్తు న్నామో లేదో ఆమె అమోఘమైన నటనని అన్నట్లు చిలిపిగా చూస్తూ.

"డోంట్ వర్రీ... ముందు రోజుకి ఎన్ని సిగరెట్లు కాలుస్తావో చెప్పు... నీ సంవత్సరం ఎకౌంట్స్ తరువాత ఎప్పుడో తీరుబడిగా కూర్చుని చూడొచ్చు..." హెండర్‌సన్ నావైపు, సిస్టర్ జోన్స్ వైపు చూసి కన్నుగీటాడు పరిహాసానికే యిదంతా అన్నట్లు.

"సుమారు యిరవై అనుకుంటాను." నావైపు చూసింది తెరీసా, అదేదో నా ఒక్కడికే తెలుసున్న విషయం అన్నట్లు "ఏమ్ ఐ రైట్" అని అడుగుతూ.

నేను వినీవిననట్లు వూరుకున్నాను

"యిరవై సిగరెట్లా... యు మస్ట్ బి వెరీ రిచ్. . మై గుడ్‌నెస్... చూడు సుందరీ యింత కంటే మంచి అవకాశం దొరకదు కాని సిగరెట్లు త్యాగం చేయి నా మాట విని."

"త్యాగమా" వెటకరించింది తెరీసా

"అదే తల్లీ.. కాల్చటం మానేయమని అభ్యర్థిస్తున్నాం."

హెండర్‌సన్ లాంటి పెద్ద డాక్టరు ఒక సర్వసాధారణమైన రోగితో మాట్లాడుతున్నతీరుకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు.

"అదేమంత పెద్ద కష్టమైన పని కాదను కుంటాను. మంచి తోడు ఒకరు దొరకాలేకాని సిగరెట్లు త్యాగం చేయటం ఎంతసేపు"

ఆ మాటలంటూ తెరీసా గ్రుచ్చిగుచ్చి నావైపు చూస్తోంది అన్న సంగతి గుర్తించకపోలేదు నేను, ఎవరిమాట ఎలావున్నా.


"ఏం నీ బోయ్‌ఫ్రెండ్ ఆ మాత్రం సహక రించలేడా నీతో. ఒక చేయివేయమను సరిపోతుంది"

"సహకారం మాట దేముడెరుగునుకాని – ఒక రెగ్యులర్ బోయ్‌ఫ్రెండ్ అంటూ ఒకడు వుంటే – నాకీ బాధలే వుండేవికావేమో."

హద్దులు దాటి దండయాత్ర సాగిస్తున్న వాళ్ళమాటల్ని శ్రద్ధగా వినటంకంటే నేను చేయ గలిగింది ఏమీలేకపోయింది.

"మై గుడ్ నెస్ .. ఈ కాలం ఆడపిల్లల్ని కాస్తంతైనా అదుపులో పెట్టలేమంటే నమ్మండి. కనీసం మాటైనా వినిపించుకోరుకదా ఏం చెప్ప టానికైనా."

హెండర్ సన్ మారుతోన్న వాతావరణాన్ని వెంటనే పసిగట్టాడు.






"మగపిల్లలు మాత్రం తీసిపోయారనుకుంటున్నారా" అప్పటివరకూ మౌనం వహిస్తూ వచ్చిన సిస్టర్ జోన్స్ విరుచుకు పడినంత పని చేసింది.

"అఫ్‌కోర్స్... అఫ్‌కోర్స్... ఓ పని చేద్దాం. ముందు నువ్వు ఓ పెర్మనెంట్ బోయ్ ఫ్రెండ్‌ని సంపాదించి పట్టుకో. ఆ తరువాత నీ సిగరెట్ల మాట ఆలోచిద్దాం."

"అయిడియా బాగానేవుందికాని — వున్న పళంగా బోయ్ ఫ్రెండ్ ఎక్కడ దొరుకుతాడబ్బా."

"నువ్వు కాస్త గట్టిగా ప్రయత్నించాలేకాని అదెంతపని?"

హెండర్ సన్ ఛలోక్తి విసిరి తెరీసా భుజాల చుట్టూ చేతులువేసి మెల్లగా తట్టాడు.

"ఎవరో ఒకరు ప్రత్యక్షం కాకపోరు నన్నీ ప్రమాదం నుంచి కాపాడటానికి — ఏమంటారు?"

"నిజమే ఎవరికి తెలుసు — అయినా యింత సుందరాంగిని ఏ మగాడు మాత్రం తప్పించుకు పోగలడు చూపులు కలిశాక" హెండర్ సన్ మనసుని మాటల్లో పెట్టకుండా వుండలేకపోయాడు.

"ఈజ్ దట్ సో" తెరీసా చూపులు నా మీద నిలిచాయని గుర్తించగానే గుండె దడదడలాడింది.

సిస్టర్ జోన్స్ ఆ మాత్రం పసికట్టలేని అమాయకురాలు కాదు.

నావైపు చూసి చిన్నగా నవ్వింది. అందులో ఎలాంటి వెటకారం, ఏహ్యాభావంలేదు. ఏవో తెలిసీ తెలియని వూహాలకి అస్పష్టమైన గుర్తింపు తప్పించి.

* * *

తెరీసా చూడటానికి ఆమె వుంటున్న వార్డ్‌లోని ప్రత్యేక గదిలోకి వెళ్ళాను. ఆ చిత్రంచూసి చివుక్కుమంది వంటరి మనసు.

"అయామ్ సారీ" చాలా కాలంగా దొరల దేశంలో వుండటంవలన అనుకుంటాను. ఆ మాటలు యాంత్రికంగా గొంతు చీల్చుకుని వూడిపడ్డాయి, ఎదురుగా హాస్పిటల్ బెడ్‌మీద సరసాలు ఆడుకుంటున్నంత పనిచేస్తున్న ఆ జంటని బెదిరిస్తూ —

వాళ్ళు యిద్దరూ ఏదో లోకంలోంచి భూమి మీద వూడిపడ్డట్లు తెప్పరిల్లారు.

"ఓ... హాయ్" తెరీసా ఎంతకైనా తెగించగల ఆడపిల్లేనని వేరే చెప్పక్కర్లేదు ఆ పలకరింపు వింటే.

"అయ్ డోంట్ మీన్ టు యింటరప్ట్ యు... సారీ."

అక్కడ ఓ క్షణంకూడా నిలబడబుద్ధి కాలేదు. గిరుక్కున వెనక్కు తిరిగాను.

భారతదేశంలో పుట్టి పెరిగిన మనసేమో అతి తేలికగా అసూయతో రగులుకుంది. ఆ మనసుకి పెట్రోలు కిరసనాయిలతో ఏమీ పని వుండదనుకుంటాను యిలాంటి విషయాలల్లో.

"ప్లీజ్ డోంట్ గో" తెరీసా గొంతుక వణికింది.

అది తడబాటో, తప్పు కప్పిపుచ్చుకోటమో నా ఆలోచనలకి అందలేదు.

"ఓ డాక్టర్ రాజేష్... అయామ్ డాక్టర్ లాయిడ్... థొరాసిక్ సర్జరీ రిజిస్ట్రార్... మిస్ పామర్‌ని చూడమని రిక్వస్ట్ చేసింది చేసింది మీరే అనుకుంటాను..."

ఆ యువకుడు తెరీసా భుజాలమీద నుంచి చేతులుతీసి బెడ్‌మీద నుంచి లేచి నావైపు తిరిగాడు తిరుబడిగా.

"ఓ ఎస్.. ఎస్" కంగారు పడడం నావంతు అయింది.

"మీతో మాట్లాడాలి... బయటకు వెళ్దామా" అంటూ నా దగ్గరకు వచ్చి చనువుగా భుజంమీద చేయి వేశాడు డాక్టర్ లాయిడ్.

"ష్యూర్..."

చురుకైన నా చూపులు సూటిగా తగిలినట్లు వున్నాయి. చటుక్కున చేయి వెనక్కు తీసుకున్నాడు డేవిడ్ లాయిడ్ తప్పు తెలుసుకున్నట్లు.

"మీతో నేనూ మాట్లాడాలి... మీ పని అయ్యాక ఒకసారి యిలా వస్తారా ?"

వెనుకనుంచి తెరీసా గొంతుక స్వతి చేసిన ఎలక్ట్రానిక్ ఆర్గన్‌లా మృదువుగా వినిపించింది.

లాయిడ్, నేనూ ఒకేసారి వెను తిరిగి చూశాం ఆశ్చర్యంగా.

"మిమ్మల్నే డాక్టర్ రాజేష్..."

లాయిడ్ నావైపు చూసి చిరునవ్వు నవ్వి మెల్లగా వీపుతట్టి బయటకు నడిచాడు.

వుత్సాహంగా నాటకం సాగుతుంటే పొరపాటున ఎవరో తెర వేసినట్లు అంతా అయోమయంగా తోచింది ఆ క్షణం.

"యు మీన్ మి..." అన్నాను పిచ్చిగా.

"మీ పేరే తలచాను అనుకుంటాను" చిలిపిగా నవ్వింది ఒంటరితనానికి వంతపాడుతూ.

"అదేమిటో యిప్పుడే చెప్పొచ్చుగా... అవతల నాకు చాలా పని వుంది. మీరు ఎలా వున్నారో చూసిపోదామని వచ్చానంతే" అన్నాను.

"ఆహా... ఆశ .. చూసిపోటానికి నేనేమైనా ఎగ్జిబిషన్‌లో వస్తువును అనుకున్నారా ఏమిటి... అదేం కుదరదు... మీరు మళ్ళీ రావాల్సిందే, నాతో చాలాసేపు మాట్లాడాల్సిందే ఎన్ని పనులు వున్నా సరే... ప్లీజ్" చిన్నపిల్లలా మారాం చేసింది.

"లుక్ మిస్ పామర్..."

"అహ... తెరీసా... పేరైనా గుర్తుంచుకోండి మహాశయా..."

"ఆల్‌రైట్... తెరీసా... ఓ విషయం చెప్తాను వింటారా ?"

"నాకు తెలుసు మీరు చెప్పబోయేది ఏమిటో... తెరీసా యిది హాస్పిటల్... నువ్వు రోగివి... నేను పెద్ద వైద్యవేత్తను... యిలా మంతనాలు సాగించటం చాలా తప్పు — ఆంతరంగిక వ్యవహారాలకీ అమూల్యమైన మా సేవలకీ మధ్య పొత్తు కుదరటం అసంభవం..."

"అన్నీ తెలిసివుండికూడా మీరు యిలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో నాకు అర్థం కావటంలేదు."

ఆమె మాటలకి అడ్డుపడి కథకి చిన్న మెలిక పెడదామని ఆవేశపడ్డాను. మాటలు త్రుంచి విసిరి చేతనైతే పోగుచేసుకుని మాలలు కట్టుకోమన్నట్లు చురుకుగా చూస్తూ,

"పిలిచినా పలికే ప్రాణి లేని ఓ ఎడారిలాంటి దీవిలో మిమ్మల్ని ఏ కంచెకో చెట్టుకో కట్టిపారేస్తే తెలుస్తుంది ఆ బాధ ఏమిటో."

చుక్క మాట దేముడెరుగును కనీసం కామా గుర్తుకైనా చోటు లేకుండా కథని పొడిగించింది, ఆ వయ్యారిభామ తన తెలివైన మాటలతో.

"ఐ సీ."

కోలుకోటానికి కాస్త టైమ్ కావాల్సివచ్చింది నాకు.

"మనిషి మొండివాడయితే నయానో భయానో నచ్చచెప్పవచ్చు. మనసు మొండిదయితేనో..."

"మనసు మొండిదని తెలిశాక దాని జోలికి పోవటంలో అర్థం వుండదనుకుంటాను."

అదంతా వ్యర్థ ప్రసంగమేనని నాకు బాగా తెలుసు. కాని తెరీసాలో ఏదో తెలియని నిక్షిప్తమైన ఆకర్షణ వుంది. అది నన్ను అన్నివిధాలా కట్టిపడేసి మాటలతో ఆటలాడిస్తోంది అని తెలుసుకోటానికి క్షణకాలం పట్టలేదు.

కాని ఆమె కంటిలో ఏమి కనికట్టు వుందోకాని ఆ చిక్కుకున్న వలయంలోంచి బయట పడటం నాకు చేతకాని పనే అయ్యింది ఆ నిముషం.

"మొండిదని చెప్పి మంచి మనసుని గాలికి వదిలేయమంటారా చెప్పండి... స్వారీ చేసే వాడికి కాస్త ఓర్పు, నేర్పు వుండాలేగాని అడవిగుర్రాన్నైనా మచ్చిక చేసుకోటం ఎంతసేపు..."

"మనసు గుర్రమే అయితే మీరు ఆ పనే చేయొచ్చు."

"డోంట్ వర్రీ ... పరుగెట్టే మనసుకి పగ్గాలు ఎలా వేయాలో నాకు తెలుసు."

"కంగారులో కాలుజారితే చాలా ప్రమాదం మరి."

"ఎవరికట ..."

"చూడండి యిప్పుడు మీతో వాదించేటంత ఓపికలేదు. టైమ్ అంతకంటే లేదుకాని దయవేసి నన్ను విడిచిపెడ్తారా" అన్నాను అసహనంగా.

ఫక్కున నవ్వింది తెరీసా. ఎలాంటి ప్రవరాఖ్యుడైన ఆ నవ్వే చూపుల్లో మంచులా కరిగిపోవలసిందేనేమో.

"మిమ్మల్ని ఎవరూ కట్టేసి కూర్చోపెట్టలేదే. యు ఆర్ ఫ్రీ అంట్ యు ?"

"మై గుడ్ నెస్."

విసురుగా బయటకు నడిచాను.

"మీ కోసం చూస్తుంటాను మరి ..."

గుమ్మం దగ్గరకి వచ్చాను.

"ప్లీజ్ ... డోంట్ డిజప్పాయింట్ మి."

క్షణం గుమ్మందగ్గర ఆగి ఏదో చెప్పాలనుకున్నాను. కాని అలాంటి ఆడదానితో మాటలు పెంచడం చిన్నమొత్తంమీద పెద్దవడ్డీ చెల్లించటమే అవుతుందని గ్రహించటానికి అదృష్టవశాత్తు రెప్పపాటు కాలం సరిపోయింది.

బయట వరండాలో డాక్టర్ లాయిడ్ నా కోసం ఎదురుచూస్తూ విలువలేని చిరునవ్వు ఒకటి విసిరాడు గాలిలోకి !

(ముగింపు పైవారం)




# భేతాళుడు మరచిన మరో కధ

## 'రాధ'

(గత సంచిక తరువాయి)

"మిస్ పామర్ హృదయంలో కుడి ప్రక్క రక్తనాళాలు బాగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది ఏంజియోగ్రామ్ చూస్తుంటే మీరు చేసిన రక్తపు పరీక్షల్లో ఏమైనా కనిపించిందా ?" కరొనరీ ఏంజియోగ్రామ్ రిపోర్టులు చూపిస్తూ అడిగాడు డాక్టర్ లాయిడ్

"బ్లడ్ కొలెస్ట్రాల్ నార్మల్‌గానే వుంది. వాళ్ళ కుటుంబంలో కూడా ఎవరికీ హైపర్ లిపిడీమియాల వంటి జబ్బులు వున్నట్లు కనిపించటంలేదు "

"అయితే డాక్టర్ హెండర్‌సన్ ఏమంటు న్నాడు ?"

"ఆ అమ్మాయి ఎక్కువగా స్మోక్ చేస్తుంది అదే కారణం అయివుండొచ్చు అంటాడు "

"కమాన్ డాక్టర్ రాజేష్ డు యు బిలీవ్ ఆల్ దట్ "

"వెల్ సిఫిలిస్ లాంటి ప్రాబ్లమ్స్ వున్నాయేమోనని ఆ పరీక్షలు కూడా చేశాం మరి "

"షి ఈజ్ క్లియర్ ఐ హోప్ "

"అఫ్‌కోర్స్ షి ఈజ్ "

"నేను చెప్తాను వినండి యిదొక రకమైన కంజెనైటల్ ప్రాబ్లమ్ అయ్ థింక్ వుయ్ హేవ్ టు డు సమ్ కైండ్ ఆఫ్ బై పాస్ ఆపరేషన్ ఏమంటారు మీరు "

"డాక్టర్ హెండర్ సన్‌తో మాట్లాడ్తాను " అన్నాను నెమ్మదిగా

మా బాస్ ఆశ్చర్యపడ్తాడు అనుకున్నానేకాని నేను చెప్పింది విని అంత గట్టిగా నవ్వుతాడని మాత్రం వూహించలేదు

"అయ్ డోంట్ బిలీవ్ యిట్ అయితే ని ఒపీనియన్ ఏమిటి" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు డాక్టర్ హెండర్‌సన్

"ఆపరేషన్ తప్పదనుకుంటాను" అన్నాను

"అయ్ హేట్ యిట్ అంత అందమైన అమ్మాయిని అన్ని బాధలకి గురిచేయటం భావ్యమే నంటావా ?" అన్నాడు హెండర్‌సన్ ఏదో ఆలోచిస్తూ

"ఆ జబ్బుకి నొప్పి పుట్టించని మందు ఏదైనా వుంటే నేనూ ఆనందిస్తాను మరి" అన్నాను

"ఐనో ఐనో "

"తెరీసా పామర్‌కి ఈ విషయం చెప్పమంటారా అయితే "

"నోనో అయ్ విల్ టెల్ హెర్ అది నాకు వదిలేసేయ్ " డాక్టర్ హెండర్‌సన్ పరాకుగా పలుకుతూ పట్టిపట్టి అడుగులు వేశాడు వార్డ్‌వేపు

* * *

"మీరు వస్తారు అనుకున్నాను ఆ పెద్ద మనిషిని పంపించారేమిటి మహాశయా" సాయంత్రం వార్డ్ రౌండ్స్‌లో చూడటానికి వెళ్తే నిలదీసి అడిగింది తెరీసా పామర్ నాడైనా చూడనీయకుండా

"ఓ అయామ్ సారీ ఐ వజ్ రేదర్ బిజీ "

"ఆహా ఏమిటో అంత పని "

"ఈ హాస్పిటల్‌లో చాలామంది పేషెంట్లు వున్నారన్న సంగతి మర్చిపోకండి మరి " చిరునవ్వుతో చిన్నగా కొట్టిపారేశాను

"నా అంత మంచి అమ్మాయిలు వున్నారా వాళ్ళలో ఎవరైనా "

"వున్నారంటేనో "

"ఆ మాట వేరే చెప్పాలా ఆ వాలకమే చెప్తోంది" మూతి ముడుచుకుంది మాటలతో కొట్టిపారేయలేక

"మై గాడ్ "

"లేకపోతే ఏ అడవిలోనో దారితప్పిన తుమ్మెదలా ఈ వార్డ్‌లో పడేసిన ఈ భౌతికకాయం చుట్టూ అందరిలా మీరు కూడా ప్రదక్షిణాలు చేసి వుండే వారేమో "

"ఎందుకట "

క్షణకాలం కళ్ళల్లో కళ్ళుపెట్టి రెప్పలు రెపరెపలాడించింది చిలిపిగా

"ముందు ఈ విషయం చెప్పండి మీ యిండియన్ డాక్టర్లు అందరూ యింత మంచిగా ముద్దుగా వుండగాలేంది మా దేశపు డాక్టర్లు ఎందుకు అలా అతికీ అతకనట్లు మాట్లాడ్తారు అంటీ అంటనట్లు ప్రవర్తిస్తారు నాకు అసలు అర్థం కావటంలేదు " అంది తెరీసా తన మామూలు ధోరణి నుంచి లోకంపోకడ వైపు మనసు మరలిస్తూ—

"ఏముంది చాలా సింపుల్ బ్రతుకు

# భేతాళుడు మరచిన మరో కథ

తెరువుకోరి పరాయి దేశాలు పట్టాం మేము, వున్న వుద్యోగాల్లో తృప్తిలేక దేశాలుపట్టి పారిపోతున్నారు మీ వాళ్ళు అదీ తేడా కొత్త అనే వింత ముందు పాత అనేది ఎప్పుడూ రోత పుట్టిస్తూ వుంటుంది మరి "

"అలాగా అయితే మీకు యింతవరకూ కనిపించిన ఆ వింతలూ విడ్డూరాలు ఏమిటంట "

"అవేనా అబ్బో చెప్పాలంటే చాలా పెద్ద లిస్ట్ వుంది మరి అయినా మీకు తెలీదా ఏమిటి అంతా కళ్ళముందే కనిపిస్తుంటేను "

"కనిపించేదంతా నిజమని నమ్మేటంత మూర్ఖులు కాదు ఆంగ్లేయులు" అంది దర్పంగా

"బహుశా మీకు తెలిసివుండకపోవచ్చు కనిపించని దాన్నికూడా నిజమని నమ్మించేటంత తెలివైనవాళ్ళు మరి మీ పెద్దలు "

"ఐ డోంట్ నో ఆల్ దట్ కాని మీ దేశంలో ఎంతోమంది యింకెన్నెన్నో జబ్బులతో బాధపడ్తుంటే వాళ్ళని గాలికి వదిలేసి మీలాంటి తెలివైన క్రూర డాక్టర్లు ఇలా పైదేశాలు రావడంలో అర్థం ఏమిటంట ఇక్కడ జీవితం జల్సాగా గడప వచ్చునని కదూ ?"

"మీ వాళ్ళకి తేనెలో ఏం లోటు వచ్చిందని అమృతం వెదుక్కుంటూ భారతదేశం వచ్చి అన్ని వందల సంవత్సరాలు మాతో సేవలు, సౌకర్యాలు అందుకున్నారు ఆ రోజుల్లో "

"అమృతం తేనెకంటే మధురంగా వుంటుందంటే దానికోసమే ప్రాకులాడటంలో తప్పులేదను కుంటాను "

"మా విషయంలో కూడా అలాగే అనుకుని సర్దిపుచ్చుకోవచ్చుగా ఏమైనా ప్రస్తావన వచ్చింది కాబట్టి చెప్తున్నాను నేను ఎవరినైనా ముందు భారతీయుడ్ని అయితే దేశం వదిలి పరాయి దేశాలు పట్టింది నా దేశంమీద నాకున్న ప్రేమ సన్నగిల్లీ కాదు, నా దేశం నన్ను పోషించలేకపోయిందనీ కాదు నువ్వు యిందాక అన్నట్లు అమృతం మధురంగా వుంటుందని దానికోసం ప్రాకులాడటానికి అంత కంటేకాదు అదో పెద్దకథ మాటల్లో చెప్తే అర్థంకాదు అందరికీ "

"ఎందుకట్లా అంతపెద్ద వుపన్యాసం ఏపిల్ పండు దొంగ ఎవరంటే జేబులు తడుముకున్నాడట వెనుకటికి ఒకడు నీలాగే "

వెన్నెల్లో మల్లెల్లా చిలిపి నవ్వులు చిందిస్తూ కోరిక తీరా చూసింది నా కళ్ళల్లోకి

ఆ చూపుల్లో భాషలు మాటలకి అందేవికావు ఆ చూపుల్లో కలయిక ఒక చెప్పలేని అనుభవం ఏ కవీ వర్ణించలేని అనుభూతి అది

రసవత్తరంగా సాగుతోన్న జీవిత చిత్రాల్ని చూసి ఆనందించాల్సిందేకాని అందులో ఒక మరపురాని పాత్రని పోషించాలనుకోటం అవివేకమే అవుతుందని నాకు బాగా తెలుసు అయినా ఒక సాధారణమైన ప్రేక్షకుడిలా వుండలేకపోయాను ఆ మధుర ఘట్టాల్లో మనసారా లీనమైపోయాను ముచ్చటైన తెరీసా చూపుల్లో మైమరచిపోతూ

"ఆల్ రైట్ " చూపులు తిప్పుకుని నన్ను నేను నిలద్రొక్కుకుంటూ — "మీతో ఓ ముఖ్యవిషయం చెప్పటానికి వచ్చాను" అన్నాను నెమ్మదిగా

"అంతేకాని నేను రమ్మన్నానని మాత్రం రాలేదు అవునా ?"

"పోనీ అందుకే వచ్చాను అనుకోకూడదూ ?"

"ఓ కె అన్నీ అనుకోటంలోనే ఆనందం వుంటుందని మీరు అనుకుంటుంటే నేను మాత్రం ఎందుకు తాపత్రయపడాలి నాకు దక్కని వాళ్ళ కోసం " ఆమె మాటలకంటే చూపులు పదునుగా గుచ్చుకున్నాయి మనసుకి ఎక్కడో మారుమూల అతి సున్నితమైనచోట

"యింతకీ మీరు చెప్పబోయేది ఏమిటో నాకు తెలుసుకాని మీరు ఏమీ వర్రీ అవ్వకండి ఆపరేషన్ చేయాలట కదా ఈ పసిడి గుండెలమీద " ఎత్తైన హృదయాన్ని వ్రేళ్ళతో నొక్కి చూపుతూ నిట్టూర్పలేక నవ్వింది పిరికిగా

"అయామ్ సారీ " అన్నాను జాలిగా యింకేమి చెప్పాలో తోచక.

"డోంట్ బి సిల్లీ డాక్టర్ రాజేష్ నేను ఏమైనా పసిపాపను అనుకున్నారా ఆ మాత్రం అర్థం చేసుకోగలను మహాశయా ఆ జీసస్ దయవలన నాకు నా అనేవాళ్ళు ఎవరూ లేకపోయినా అవసరానికి వుపయోగపడటానికి చిన్న మెదడు మాత్రం వుంది మీ బాస్ కూడా తెగ వర్రీ అయిపోయాడు యిందాక ఆ విషయం చెప్తూ ఆ ఆ ఆగండి " నా నోరు మూయించింది కట్టిపడేసే కొంటెచూపులతో

"మీరేం చెప్పక్కర్లేదు నాకు అంతా తెలుసు ఓ కె ఆపరేషన్ అంటే చాలా పెద్ద విషయమే అందులో గుండెలమీద ఆపరేషన్ అంటే చావు బ్రతుకులతో చెలగాటమే, అదీ కాదనటంలేదు అయితే మాత్రం తల బాదుకుని ఏడిస్తే ఎవరికి మాత్రం వరిగేది ఏముంటుంది చెప్పండి చూడండి నేను పుట్టగానే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాను నా తల్లి నవమాసాలు నా భారాన్ని కడుపులో ఎలా మోసిందో ఆ భగవంతుడికే తెలియాలికాని నా శరీరాన్ని మాత్రం ఓ చర్చి గుమ్మంలో కనిపారేసి కోట్లాది జీవుల్లో కలిసిపోయింది నోరులేని జంతువులా ఆ వుత్తమ యిల్లాలు ఎక్కడుందో ఏవిటో ఆ పరమాత్ముడికి కూడా తెలిసివుండదు దేముడికి మాత్రం యింకో పని లేదా ఏమిటి యిలాంటివన్నీ పట్టించుకుంటూ కూర్చోటానికి పుట్టినప్పుడే నాకు నోరు వుండివుంటే ఏంచేసి వుండేదాన్నో తెలుసా నువ్వు నా తల్లివేనా ? నువ్వు చేస్తున్న పని క్షమించరానిది, ప్లీజ్ అలాంటి పాపానికి తలపెట్టి, నన్ను అనాధను చేయకు అని అందరికీ వినిపించేలా అరిచి చెప్పివుండేదాన్నేమో అంతటి మహాత్మురాలు బ్రతిమలాడితే మాత్రం మనసు మార్చుకుని వుండేదంటారా ఏమైతేనేమి నా బ్రతుకు మాత్రం గూడులో వదిలిన గుడ్డులా అయ్యింది

చుట్టూ వున్నవాళ్ళు జాలితో చూస్తుంటే ఈ తనువు ఎండకి వానకి తట్టుకుని యింతవరకూ నిలబడగలిగింది అందుకే ఈ శరీరంమీద నాకు ఏ మాత్రం మోజులేదు ప్రాణభీతి అంతకంటే లేదు

నేను చచ్చిపోతే బాధపడేవారు ఎవరూ లేరు కాని నేను బ్రతికినంత కాలం నన్నుచూసి సంబరపడే వాళ్ళు మాత్రం చాలామంది వున్నారు మరి మీకు తెలుసుగా ఆ సంగతి సారీ ఈ స్వీయచరిత్రలో మీకు తలనొప్పి తెప్పిస్తున్నట్లున్నాను కదూ ''

''నో నో ''

వున్నట్టుండి ఎవరో తలుపు తోసుకుని రూమ్‌లోకి వచ్చిన శబ్దం అయింది

నేను వులిక్కిపడ్డాను

నర్స్ పార్కర్ మా వైపు పట్టిపట్టిచూస్తూ ''హల్లో డాక్టర్ ఈ రోజు ఓవర్ టైమ్ చేస్తున్నావా ఏమిటి కొంపతీసి టైమ్ అయిదు దాటింది మరి'' అంది వెటకారంగా నవ్వుతూ

''వృత్తిరీత్యా డబ్బులు యివ్వకపోయినా ఒకోసారి ఓవర్‌టైమ్ చేయాల్సివస్తుంది మరి మనిషి బాగోగులు చూసేవాళ్ళకి అదేమీ కొత్తకాదు తప్పు అంతకంటే కాదనుకుంటాను'' అన్నాను కాస్త కటువుగా ముఖంమీద రవ్వంత చిరునవ్వు అద్దు పెట్టుకుంటూ

''అంతేకదా అయితే ఫర్వాలేదు యిఫ్ యు డోంట్ మైండ్ తెరీసా పల్స్, బి పి చూడాలి '' పదునైన మాటల్లో ఏదో తెలియని ఓర్వలేనితనం వెళ్ళగ్రక్కుకుంటూ తన పని చేసుకు పోయింది నర్స్ పార్కర్

అలాంటి పరిస్థితుల్లో మనిషి ఏ దేశానికి చెందినా మనసులో అనుమానం కలగటంలో ఆశ్చర్యం వుండదేమో ?

''అయితే ఏమనుకుంటున్నారు మీరు నా



గురించి ముఖమాట పడక్కర్లేదు మహాశయా వున్నమాట చెప్పండి సంతోషిస్తాను'' మళ్లీ మొదలు పెట్టింది తెరీసా తన చిలిపి ధోరణిలో

''సారీ మీ వెనుక యింత విషాద గాథ వుందంటే నేనేకాదు ఎవరూ నమ్మరు రియల్లీ'' అన్నాను

''కమాన్ డోంట్ బి సిల్లీ డాక్టర్ విషాదమా పాడా జీవితాన్ని మచ్చిక చేసుకుంటూ ఆనందాన్ని ఆస్వాదించడం ఒక్కటే నాకు తెలుసు పిరికి మంత్రాలు పిచ్చి సానుభూతులూ ఈ వంటికి పడవు అవంటే ఎలర్జీ మహాశయా ఏం చేయమంటారు ''

తెరీసా మాటలు ఆలకించటం నా వంతు అయింది

'వోంట్ యు కిస్ మి ''

కదిలేముందు మాటల్తో మళ్ళీ కట్టిపారేసింది

''మనసులోని భీతికి మనిషి బాధలకీ మంచి మందు ఏమిటో తెలుసా ?'' అంటూ కవ్వింపు చూపులతో మనసుని చిత్తుచేసింది ఆ వయ్యారిభామ

''నాకు తెలుసు ''

ఎవరో మంత్రించినట్లు యాంత్రికంగా ముందుకు వంగి మృదువుగా చుంబించాను విచ్చిన మందారంలా ఆకర్షిస్తున్న ఆ చూడామణి పెదవుల్ని తెరీసా తన్మయత్వంతో కళ్ళు మూసుకుంటే సిగ్గు ఎడటం నా వంతు అయింది

* * *

మర్నాడు ఆపరేషన్‌కి వెళ్తుందనగా వార్డ్ రౌండ్స్ చేస్తూ తెరీసా రూమ్‌కి వచ్చాం

''డోంట్ గెట్ స్కేర్డ్ ఆపరేషన్ అంతా బాగా జరుగుతుంది అయ్ ప్రామిస్'' అంటూ చేయి పట్టుకుని నిమిరాడు డాక్టర్ హెండర్‌సన్

''భయమా ! భయం ఎందుకు మీలాంటి డాక్టర్ల చేతుల్లోపడ్డాక ఎలాంటి ప్రాణికయినా వున్న భయం పోతుందనుకుంటాను'' అంది హుషారుగా

''ఎందుకట ''

''మీరంతా గుప్పిటలో ప్రాణాన్ని కూడా గట్టిగా బిగించి పట్టుకోగల సమర్థులు కాబట్టి '

''మై గుడ్‌నెస్ '' హెండర్‌సన్ కొట్టి పారేసినట్లు నవ్వాడు బిగ్గరగా

''రియల్లీ యు ఆర్ ఎ గ్రేట్ డాక్టర్ ''

ఆమె కంఠం వణికింది

''కమాన్ మై డియర్ ఈ మాత్రం దానికే నువ్వు మమ్మల్ని అంతగా పొగడాల్సిన పనిలేదు టేక్ యిట్ ఈజీ విత్ యు'' అన్నాడు డాక్టర్ హెండర్‌సన్, తెరీసా రెండు భుజాలమీద చేతులు వేసి ఆప్యాయంగా నొక్కుతూ

''మనిషికి కావలసింది మందు ఒక్కటేకాదు మమత మమకారం కూడా ఎంతో అవసరం సానుభూతి చూపిస్తే సరిపోదు బాధని అర్థం చేసుకొనే సహృదయం కూడా వుండాలి మందులిచ్చేవాడు ఒక్కడే డాక్టర్ కాదు అభిమానం అనురాగం పంచేవాడుకూడా డాక్టరే మీ మందులు తగ్గించలేని ఎన్నో బాధల్ని ఓ మంచి మనసు ఓ మంచిమాట యిట్టే తగ్గించగలవు ''


## మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

# కేశవర్ధినిని

### చేర్చిన కొబ్బరినూనె

OBM 6119/TG








ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి తల చర్మానికి అంటేటట్టుగా తలకు రాసుకోండి

ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము - కేశవర్ధిని వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.




కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092



ఆ మాటలంటూ తెరీసా షూటిగా నావైపు చూడటం డాక్టర్ హెండర్‌సన్ కంట పడకపోలేదు

"దేర్ యు ఆర్  ఆ పొగడ్తలన్నీ నీకే అనుకుంటాను" హెండర్‌సన్ తన మాటలకి విలువ లేని నవ్వు ఒకటి పల్చటి కాగితంమీద పేపర్ వెయిట్‌లా బరువు పెట్టాడు

ఆ అనుకోని మలుపులో నన్ను నేను నిల్ద్రొక్కుకోలేక చైతన్యంలేని శిల్పమే అయ్యాను

*    *    *

తెరీసా గుండెలమీద ఆపరేషన్ సవ్యంగానే జరిగింది

"అదృష్టవంతురాలు" అంది సిస్టర్ జోన్స్

"మనం చేయవలసింది చేశాం ఎవరి అదృష్టం ఎలా వుందో ఎవరికి తెలుసు" డాక్టర్ హెండర్‌సన్ గంభీరంగా అన్నాడు

నేను కించిత్తు ఆశ్చర్యపడ్డాను అతని వాలకం చూసి

హెండర్‌సన్ అంతవరకూ ఎప్పుడూ ఏ విషయం లోనూ ఎవరినీ నిరుత్సాహపరచటంగాని చిన్నబుచ్చటం గాని నేను చూడలేదుమరి

"ఈ ఆపరేషన్ అంటే మీకు అంత నమ్మకం లేనట్లుందే" సిస్టర్ జోన్స్ మాటలు విసిరింది

"ఒకరి నమ్మకాల గురించి యింకొకరు పట్టించుకోటం పిచ్చితనం  ఆలోచించటం అంత కంటే అవివేకం  ఏమైనా ఫలితం కోసం ఎదురు చూడటం తప్పించి ప్రాకులాడితే లాభంలేదు సిస్టర్" అన్నాడు డాక్టర్ హెండర్‌సన్ ఆవేశంగా

"అలా అని వున్న ఆశ చంపుకోటంలో అర్థం వుండదనుకుంటాను" సిస్టర్ జోన్స్ పౌరుషంతో మాటలు పొడిగించింది

"ప్రస్తుతానికి అంతా బాగానే వుందికదా వై షుడ్ వుయ్ వర్రీ" అన్నాను కలగజేసుకుంటూ

"ఒన్ తింగ్ యు మస్ట్ రిమెంబర్ డాక్టర్ తెలివితో గుండెల్లో పరుగెట్టే రక్త ప్రవాహానికి కాల్వలు త్రవ్వి లోతులు పెంచగలుగుతున్నాడేమో కాని ఈ నొసట రాసిన గీతలకి వంకరలు మాత్రం దిద్దలేకపోతున్నాడు మనిషి, నువ్వు ఎంత పెద్ద వైద్యుడివయినా చావు దగ్గరకివచ్చి భుజం తట్టితే ఏంచేయగలవు చెప్పు"

డాక్టర్ హెండర్‌సన్ ఆ మాటలు అని చటుక్కున అక్కడ నుంచి వెళ్ళిపోయాడు సిస్టర్ జోన్స్ నేను ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ క్షణకాలం అచేతనంగా వుండిపోయాం

"ఎందుకలా రుసరుసలాడుతున్నారు ఈవేళ" తెప్పరిల్లి దెప్పిపొడిచింది సిస్టర్ జోన్స్ పౌరుషం చంపుకోలేక

*    *    *

ఆ తరువాత ఒకటి రెండుసార్లు తెరీసాని హాస్పిటల్ ఓ పి లో చూశాను పూర్వమంత చనువుగా మీదపడి ముద్దులాడక పోయినా చిరు నవ్వుతో ఆప్యాయంగా పలకరించింది చాలాసేపు మాట్లాడింది హుషారుగా

రెండు మూడు నెలల తరువాత ఒకసారి వార్డ్‌లో వూసులాటల మధ్య సిస్టర్ జోన్స్ వున్న ట్లుండి అడిగింది

"నీకు తెలుసా ఈ విషయం డాక్టర్ హెండర్‌సన్ భార్యకి విడాకులు యిస్తున్నాడంట" అని

"నిజమా  చాలా చిత్రంగా వుందే" అన్నాను ఆశ్చర్యపడూ

"ఈ దేశంలో మా ప్రజలకి అది బాగా అలవాటే మరి విడాకులు యిచ్చేవాళ్ళని చూసి ఆశ్చర్య పడాల్సిన పనిలేదు" అంది కించిత్తు కోపంగా

"ఏది అలవాటైనా ఏది పొరపాటైనా అనుకోనిది జరిగితే చూడటానికి చిత్రంగానే వుంటుం దనుకుంటాను సిస్టర్ డియర్  ఇంతకీ కారణం ఏమిటంట" తెలివిగా మాటలు అంటించాను

"ఏముంది  ప్రతి మగాడిలాగే ఈయనగారికి కూడా ఆ మోజు కాస్తా తీరిపోయి వుంటుంది" అంది రుసరుసలాడుతూ

"మోజు తీరిపోటానికి హెండర్‌సన్ వయసులో వున్న కుర్రవాడు ఏమీ కాదుగా పిల్లలూ, పరువూ వాటిమాట ఏమిటి ?"

"అయితే నీకేమీ తెలీదన్నమాట  హెండర్‌సన్ భార్య యిక్కడ స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తుండేది ఓ పది పదిహేను సంవత్సరాల క్రితం  అందరితో తిరిగినట్లే ఆమెతో కూడా తిరిగాడు  ప్రేమలో పడ్డాడో, పొరపాటే జరిగిందో తెలీదుకాని ఫలితం ఆమెగారికి కడుపు అయ్యింది  హెండర్‌సన్ చిక్కుల్లో పడ్డాడు. పెళ్ళంటే చిక్కులు కాదా మరి వయసులోవున్న కుర్రవాడికి  ఏమైతేనేం అందరిలా ఆమెను వదిలించుకోలేక కట్టుకున్నాడు  కాని ఆ పుట్టిన పిల్లవాడు హెండర్‌సన్‌కి పుట్టలేదనీ, అతనికి అసలు పిల్లలే పుట్టరనీ ఒక వదంతి ఏర్పడింది  ఈ తతంగమంతా చూస్తుంటే అదంతా నిజమే అయివుంటుంది అనిపిస్తోంది" అంది

"వెల్  ప్రతిమనిషీ స్వేచ్ఛాజీవే మీ దేశంలో ఏమంటావ్ సిస్టర్  ఎవరు ఏం చేసినా ఎవరూ కాదనలేరుగా మరి" అన్నాను

సిస్టర్ జోన్స్ చిరునవ్వు నవ్వింది కళ్ళల్లో చిందులు త్రొక్కుతున్న చిరుకోపాన్ని కప్పిపుచ్చు కుంటూ

*    *    *

మరో ఆరునెలల కాలం తెరచాప ఎత్తిన పడవలా సునాయాసంగా సాగిపోయి కాలగర్భంలో కలిసిపోయింది

ఆ రోజు యధాప్రకారం తొమ్మిదిగంటలకే హాస్పిటల్‌కి చేరుకున్నాను

ఎప్పుడో శలవు రోజుల్లో తప్పించి ఉదయం వేళలో వార్డ్‌లో వాతావరణం అంత నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుండటం నేను అంతవరకూ చూడ లేదుమరి  ఏముంది? బ్రిటిష్ ప్రజలంతా యింకేపనీ లేక జబ్బుల జోలికి పోమని గట్టిగా సత్యాగ్రహం చేస్తున్నారేమో అనిపించింది

సిస్టర్ రూమ్‌లోంచి చిన్నగా మాటలు వినిపిస్తున్నాయి

"లోపల ఎవరున్నారు" ఎదురుగా కనిపించిన స్టూడెంట్ నర్స్‌ని అడిగాను

"మిసెస్ హెండర్‌సన్  నీకు తెలీదుకదూ డాక్టర్ హెండర్‌సన్‌ని రాత్రి ఎడ్మిట్ చేశారు కరొనరీ కేర్ యూనిట్‌లో" అంది కంగారు కంగారుగా

"వాట్"

"లిసన్  హి డైడ్ దిస్ మార్నింగ్"

"మైగాడ్  ఏమిటి నువ్వంటోంది ?"

"బిలీవ్ మి  యిటీజ్ ట్రూ డాక్టర్ రాజేష్"

నాకు తల తిరిగింది  వున్న పళంగా తలుపు తోసుకుని సిస్టర్ రూమ్‌లోకి వెళ్ళాను  ఆ దృశ్యం చూసి వున్న మతిపోయింది

"మిస్ పామర్  మీరేం చేస్తున్నారు ఇక్కడ" పిచ్చిగా పలకరించాను తెరీసా పామర్‌ని

# ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

### ఎమ్ ఎస్ ఎస్ - రాయవరం

విజ్ఞానం నాగరికత పెంపొందిన నేటి సమాజంలో అమాయకులైన కొందరు వరకట్న పిశాచ కబంధ హస్తాల్లో యిరుక్కుని జీవశ్చవాల్లాగా మారటానికి కారకులు ఎవరు ? వరకట్నం యిచ్చే వాళ్లా ? పుచ్చుకునే వాళ్లా ? లేక కళ్లుండీ అంధులుగా చూసే సమాజమా !

★ బాగుంది వివాహ బంధాన్ని డబ్బుకి ముడిపెట్టి ఇచ్చి పుచ్చుకునే వాళ్ళ బాగానేవున్నారు మధ్య సమాజం గుడ్డిదయిందా ? వ్యక్తి సమస్య ముదిరి దాని దుష్ట ఫలితాలు బయటకి పాక్కి సమాజాన్ని కలుషితం చేస్తున్నప్పుడే ఆ సమస్య సమాజ సమస్యగా తయారవుతుంది ఇప్పుడీ కట్న సమస్య భయంకర రూపం దాల్చి మనిషిని నైతికంగా పతనం చేసి, రాక్షసులుగా మార్చేస్తోంది కనుకనే సంఘ సంస్కర్తలు పాటుపడుతున్నారు కాని ఒక్కటి గుర్తుంచుకోవాలి ఇచ్చేవాళ్ళ, పుచ్చుకునే వాళ్ల దృక్పథం మారితే తప్పించి కట్న సమస్య అడుగంటిపోదు పెళ్లి మాటలని సంత బేరంగా మార్చిన ఘనత— అమ్మాయి అబ్బాయి తల్లి తండ్రులకే కాదు సంధానకర్తలకి కూడా దక్కుతుంది అలాగే చదువు సంస్కారం వుండీ గంగిరెద్దుల్లా తలూపే దౌర్భాగ్యపు స్థితికి దిగజారిన— అమ్మాయి అబ్బాయిలకీ దక్కుతుంది స్వంతంగా పెళ్లాన్ని పోషించలేనివాడు పెళ్లికి సిద్ధపడితేనేంయీ డబ్బు బేరాలు

### ఆర్. ఆర్ జి — కరీంనగరు

నేను పది సంవత్సరాలనుంచి పని చేస్తున్నాను వెయ్యి రూపాయలు వస్తుంది ప్రస్తుతానికి ముగ్గురు పిల్లలు నాకు అన్నీ పోగా ఐదొందలు చేతికి వస్తుంది నేను ఒక అమ్మాయిని పెళ్లాడా లనుకుంటున్నాను ఆమె ద్వారా ఆస్తి వస్తే లక్షాధికారి కావాలని వుంది లేక ఉద్యోగస్తురాలిని చేసుకోనా ?

★ మీరు చాలా లేటుగా సలహాకి వచ్చారు కాలాన్ని వెనక్కి తిప్పి బ్రతుకు కొత్త మలుపుతో ప్రారంభించకల్గితే బాగానే వుంటుందిగాని — సాధ్యం మటుకు కాదు ముగ్గురు పిల్లల తండ్రి చేతికొచ్చేవి ఐదొందలు — మళ్లీ పెళ్లి చేసుకోవాలని ఆశ ! ఇంతకంటే అత్యాశ వేరొకటి వుండదు ఉన్నదాంతో తృప్తిగా కాలం గడపడానికి ముందు ప్రయత్నించండి, లక్షాధికారి కాడానికి పెళ్లాన్ని మోసం చేయక్కర లేదు లక్షాధికారి అమ్మాయి — మిమ్మల్ని చేసుకోడానికి సిద్ధపడవలసిన స్థితిలోనూ వుండదు !!

### ఆర్ ఆర్ జి. — మాబాపూర్

కొందరినిచూస్తే ప్రేమా, గౌరవంకల్గుతాయి మరి కొందరిని చూస్తే అసహ్యం, యీర్ష్య కల్గుతాయి ఎందువల్ల ?

★ మానవ బలహీనతలవల్ల

### బి. వి కె - బొంబాయి

ఆరుద్రగారి 'రాముడికి సీతేమౌతుంది' వ్యాస సంపుటి ప్రజలలో కల భక్తి భావన విరిచేసిన వారైనారని అభిప్రాయం ?

★ నేను చదవలేదు పరిశోధన విషయాలు నాకంత కొరుకుడు పడవు

### వి వి ఆర్ — హైదరాబాదు

జీవితంలో స్తబ్దతకి కారణం ఏమిటి ?

★ దేనిలోనూ కుతూహలం లేకపోవడం కనపర్చకపోవడం !

### యు. యు యు. — ఎమ్మిగనూరు

అక్కయ్యగారూ నా రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టింది మీరే ఎలాగంటారా ? మొదట నా ప్రశ్నకు జవాబు యిచ్చింది మీరు ఇప్పుడు ప్రశ్నలు, ఉత్తరాలనుంచి చిన్నచిన్న కధలు వ్రాయడం వరకు ఎదిగాను ?

★ గుడ్ చాలామంది పాపులర్ రైటర్స్ నాడు మాలతికి ప్రశ్నలు రాసి ఎదిగి రచయితలయిన వాళ్లే ఎక్కడో — నాంది పల్కాలికద

### టి కె ఆర్. — మహాదేవిపురం

నేటి దీన, హీన స్థితిలోకి దిగిన విద్యా విధానాన్ని మళ్లీ పాత బాణీలోకి దించితే ?

★ ఎలా ? కాలాన్ని వెనక్కి పరుగెట్టించ కలరా ? నాశనమైపోయిన కొన్ని తరాలవారిని ఉద్ధరించకలరా ?!

### డి. ఎస్ బి ఆర్. — అనంతపురం

అక్కయ్యా మీరు బ్రాహ్మణులా ?

★ అవును ఇదే ప్రశ్న కొన్నేళ్ల క్రిందట ఎవరేనా అడిగితే చిందులు తొక్కేదాన్ని — బుద్ధి లేదా కులం, గోత్రంతో మీకేం పని అని — కాని కాలం చాలా మారింది ఇలాంటి విషయాల్లో — నేనింకా కన్నుమూయక ముందే — ఆటవిక స్థితి చూసేస్తానన్న ధైర్యం వుంది !

### వి జె — దొనకొండ

ప్రపంచపు అందాన్ని గురించి ఏ కవీ చెప్పనంత గొప్ప కలవి కళ్లు— స్త్రీ కళ్లు నిజమా ?

★ నిజమే అయివుంటుంది ఎందుకంటే ఆడివారి కళ్లు మాటల కందని భావాలని సహితం పల్కిస్తాయి

### ఎస్. వి వి - గద్వాల

మన రాజ్యాంగంలో పొందుపరచిన సెక్యులరిజానికి నిర్వచనం ?

★ ఏం లేదు— ఎవరి 'సెక్టు' అభివృద్ధికి వారు పాటుపడే హక్కు అని అర్థం ! ★

---

"మిస్ పామర్ కాదు మిసెస్ హెండర్‌సన్" అంది సిస్టర్ జోన్స్ చురుకుగా

"వాట్ "

'డాక్టర్ హెండర్‌సన్ తెరీసా, పెళ్ళి చేసుకుని మూడు నాల్గు నెలలు అవుతోంది నీకు తెలీదా ?" అంది సిస్టర్ జోన్స్ నేనేదో తప్పు చేసినట్లు చూపులతో మందలిస్తూ

కలవరపాటు, నివ్వెరపాటు, కంగారు, ఏదో తెలియని కోపం అన్నీ ఒకదాని కొకటి తోడునీడై నన్ను నిలువెల్లా కంపింపజేశాయి

"ఏం లాభం అనుకోకూడనిది జరగరానిది జరిగిపోయింది" అంది సిస్టర్ జోన్స్

"నాకూ యిప్పుడే తెలిసింది సిస్టర్ అయామ్ రియల్లీ షాక్‌డ్ "

ఆపైన యింకేమనాలో యింకేంచేయాలో తోచక తెరీసా వైపు, సిస్టర్ జోన్స్‌వైపు పట్టిపట్టి చూస్తూ వుండిపోయాను

కలలో కూడా వూహించనిది నిజంగా జరిగితే

## భేతాళుడు మరచిన మరో కధ

మనిషి పరిస్థితి ఎలా వుంటుందో బాగా అర్థమయ్యింది ఆ చిత్రమైన సంఘటన చవిచూశాక!

* * *

ఆ తరువాత తెరీసా నా కంట పడకపోయినా ఆమె వదిలిపోయిన చిత్రమైన అనుభూతి, చిత్రాతి చిత్రమైన అనుభవాలు మదిలో మెదులుతూ ఎప్పటి కప్పుడు కంటిముందు కదలాడుతూనే వున్నాయి

తనవలన సంతానం కలగదని తెలిసికూడా ఆ వయసులో డాక్టర్ హెండర్‌సన్ మళ్ళీ పెళ్ళి ఎందుకు చేసుకున్నట్లు ?

తెరీసాకి నిజంగా ఆ సంగతి తెలీదా ?

డబ్బుకీ, హోదాకీ ఆశపడిందా ? గతాన్ని మర్చిపోటానికి అనుభవం విజ్ఞానం వున్న ఆ పెద్ద మనిషి నీడ కోరుకుందా ?

ఏ వయసులోవున్నా మగవాడికి ఆడదానిమీద మోజు పుట్టటంలో ఆశ్చర్యం వుండదు కాని అంత చిన్నవయసులో వయ్యారిభామ తెరీసాకి ఆ వయసు మీరిన పెద్దమనిషిమీద మోజు ఎందుకు పుట్టాలి ? అవసరానికి ఆ పని చేసిందా ? లేక నిజంగానే ఆయన మీద ప్రేమపుట్టి పెళ్ళి చేసుకుందా ?

ఇత్యాది ప్రశ్నలన్నింటికీ జవాబులు వున్నాయో లేవో నాకు తెలీదు తెలిసినా చెప్పకపోతే నా తల బ్రద్దలుకాదు కాని లేనిపోని ఆలోచనలతో జరిగింది వూహించటానికి ప్రయత్నిస్తే నా తలనొప్పితో బ్రద్దలు కావొచ్చు అందుకే జరిగిందంతా ఒక కల అనుకుని ఈ కధను మాత్రం గుర్తుంచుకున్నాను ఎప్పుడైనా పొరపాటున భేతాళుడు ఎదురుపడి ఏమిటి నీ సమాధానం అని నిలదీసి అడిగితే ఏదొకటి చెప్పాలిగా మరి ?

"జీవితం మహా సముద్రం నాయనా ఎవరికి తెలుసు చావు అన్నది పెద్ద వుప్పెనై ఎప్పుడు వస్తుందో !"

భారీ ఆంగ్లేయుడు అన్న ఆ చివరి మాటల్ని శాస్త్రీయ జ్ఞానంతో పరీక్షించటానికి సమయం లేకుండా చేసింది మా రైలు లివర్‌పూల్ లైమ్‌స్ట్రీట్ స్టేషన్‌లో భారంగా ఆగుతూ !!!

(అయిపోయింది)